క్లుప్తంగా

చౌడేశ్వరిదేవి తిరునాల ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరిదేవి తిరునాల సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణతోపాటు మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి ఉసేన్‌స్వామి ఉరుసు


ఉసేన్‌స్వామి సమాధి

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాలో బుధవారం నుంచి ఉరుసు ప్రారంభం కానున్నట్లు దర్గా ముతవల్లి ఎం.గఫార్‌మియా తెలిపారు. హజరత్ ఉసేన్‌వలి(రహ) 526వ ఉరుసు మూడు రోజులపాటు జరుగుతుందన్నారు. మొదటి రోజు గంధం(సొందల్), 10వ తేదీ ఉరుసు(మేలా), 11న జియారత్ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

బేతంచెర్ల ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


సీఐ వెంకటేశ్వరరావును కలిసిన ఎస్‌ఐ తిరుపాలు

బేతంచెర్ల: స్థానిక ఎస్‌ఐగా కేసీ తిరుపాలు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో నంద్యాల వీఆర్ నుంచి ఆయన బేతంచెర్ల వచ్చారు. ఈ సందర్భంగా సీఐ డి.వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ నియామక రాత పరీక్ష నిర్వహించాలి

కోవెలకుంట్ల: పోలీస్ కానిస్టేబుల్స్ నియామకానికి సంబంధించి రాత పరీక్ష నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. సోమవారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రంలో 6,400 కానిస్టేబుల్స్ పోస్టుల భర్తీకి 2022లో నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాత పరీక్ష జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఇప్పటి వరకు పరీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. త్వరితగతిన పరీక్ష నిర్వహించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డి మాండ్ చేశారు. అలాగే గ్రూప్–1, 2 పరీక్షలు నిర్వహించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చే యాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నెలా రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీని అమలు చేయాలని పేర్కొన్నారు.

బీఎఫ్‌టీ సస్పెన్షన్


రాంభూపాల్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: ఎస్‌ఆర్‌జీఎస్ మండల కార్యాలయంలో బీఎఫ్‌టీ (బేర్ ఫుట్ టెక్నీషియన్)గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్యాపిలి మండలానికి బదిలీపై వెళ్లిన రాంభూపాల్‌రెడ్డి సస్పెండ్ అయినట్లు ఏపీఓ ప్రతాప్ సోమవారం తెలిపారు. రాంభూపాల్‌రెడ్డి మండలంలోని అప్పలాపురం, ఇల్లూరుకొత్తపేట, రామక్రిష్టాపురం, పాతపాడు గ్రామాల బీఎఫ్‌టీగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో జాబ్‌కార్డులు సృష్టించి సుమారు రూ.11. 47 లక్షల దుర్వినియోగానికి పాల్పడ్డారని అధికారుల పరిశీలనలో తేలిందన్నారు. అవినీతి ఆరోపణలతో జిల్లా ఉన్నతాధికారులు ఈ నెల 4వ తేదీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏపీఓ తెలిపారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



పార్టీ అనుబంధ విభాగాల నూతన కమిటీని అభినందిస్తున్న కాటసాని రామిరెడ్డి, సమావేశానికి పెద్ద ఎత్తున హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కోవెలకుంట్ల: కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అధికార పార్టీ నాయకులు వేధిస్తున్నారని కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తూ అక్రమ కేసులు పెట్టిస్తూ జైలుకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణ శివారులోని వీఆర్, ఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల మండల అధ్యక్షులు, పార్టీ మండల నూతన కమిటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాటసాని మాట్లాడుతూ.. గతంలో టీడీపీ నాయకులపై రౌడీషీట్లు ఎత్తివేసి కొత్తగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు భయపడాల్సిన అవసరం లేదని, ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. తప్పుడు కేసులు బనాయిస్తే అవసరమైతే ఎంతటి ఆందోళన కార్యక్రమానికైనా వెనుకాడబోమని తెలిపారు. పచ్చని గ్రామాల్లో మంత్రి బీసీ చిచ్చు పెడుతూ ప్రశాంత గ్రామాల్లో అలజడి సృష్టిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదినెలల కాలం నుంచి నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులకు జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. భవిష్యత్ వైఎస్సార్‌సీపీదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి 2.0 పాలన కొనసాగుతుందని.. కూటమి నేతలకు వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. కోవెలకుంట్ల పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో కూటమి నాయకులు పేదల ఇళ్ల స్థలాలు ఆక్రమించుకుని ఆ స్థలాలను ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే అక్రమంగా లాక్కున్న ఇళ్లను పునాదులతో సహా కూల్చివేసి పేదలకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు షాజహాన్, విజయమోహన్, మండల కో ఆప్షన్ సభ్యుడు దిల్కాబాషా, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, ఉప్పరి నాగేంద్ర, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి, పార్టీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఉప్పరి సుబ్బరాయుడు, నాయకులు ఎల్‌ఐసీ రామసుబ్బారెడ్డి, కానాల రవీంద్రనాథరెడ్డి, చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి, సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, అమడాల శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, శ్రీరాముల అబ్రహం, ఉసేన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, అందె శ్రీనివాసరెడ్డి, దండె వెంకటశేషిరెడ్డి, శేషిరెడ్డి, హరినాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రాజారెడ్డి, సేనారెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాసనాయక్, అనుబంధ విభాగాల అధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, మహేష్, దశరథరామిరెడ్డి, అక్బర్‌బాషా, దేవరాజు, రామిరెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి పనిచేయాలి


కాటసాని రామిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వివిధ విభాగాల్లో పార్టీ పదవులు పొందిన వారు కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని కాటసాని రామిరెడ్డి తెలిపారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా జోళదరాశికి చెందిన ఉప్పరి సుబ్బరాయుడుని నియమించడంతో కాటసానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకుల అరాచకాలు, అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాటసాని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పటికీ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నాయకులు పోతం రాజేశ్వరరెడ్డి, గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, రామసుబ్బరాయుడు, పెద్దసుబ్బరాయుడు, ఈర్నపాటి సుధాకర్, ఉప్పరి మధుకిరణ్, రహంతుల్లా, చంద్రశేఖర్, సుంకేసుల సురేష్, వెంకటేశ్వర్లు, చిన్న సుబ్బరాయుడు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బనగానపల్లె: మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన ఈడిగ రామసుబ్బయ్యగౌడ్ సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. నాయకులు నాగయ్య, అమీర్, మహబూబ్ బాషా, షరీఫ్, చిన్నకుల్లాయి, ఉస్మాన్‌గని పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


బృందావనకాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్: పట్టణంలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి గుడి సమీపంలోని బృందావనకాలనీని మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు పూజారి వెంకటేశ్వరమ్మ, అర్జు రమణ, వంశీ, డీఈ రఘు, ఏఈ సురేష్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. కాలనీలో మంచినీటి సదుపాయం, డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మంచినీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డీఈ రఘు, ఏఈ సురేష్‌లకు సూచించారు.

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులను అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, నిర్వాహకులు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సోమవారం ఎస్‌ఐ రమేష్ బాబు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈపోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. బేతంచెర్ల హెచ్‌ఎంటీ జట్టు ద్వితీయ, ముద్దవరం తృతీయ, బేతంచెర్ల సంజీవనగర్ జట్టు 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. దాతలు నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, జయరామిరెడ్డి, గూని నాగరాజు, పురుషోత్తం, ఆచారి చేతుల మీదుగా విజేతలకు రూ.25వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. నిర్వాహకులు నిరంజన్, ఎర్రమల, మధు, నాగరాజు, నక్కరవి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లి, ప్యాపిలి వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు చిన్నరాజుపాళెం గ్రామం వద్ద రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. రూ.12.50 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో రహదారుల కనెక్టివిటీ పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సింగిల్ రోడ్డుగా ఉన్న ప్యాపిలి, యాగంటిపల్లి, బనగానపల్లె రోడ్డును నాలుగు రోడ్ల లైన్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గుంతలు పూడ్చడనికి వీలులేని విధంగా ఉన్న రోడ్లను సీ కేటగిరి కింద రూ.3 వేల కోట్ల అంచన వ్యయంతో ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు మంత్రి బీసీ తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి, డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేన్ పాల్గొన్నారు.

కనుల పండువగా పల్లకీ సేవ



బేతంచెర్ల ముసలాయి చెర్వులో గ్రామోత్సవం, సీతారామ, లక్ష్మణ, అంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కొట్లవారిపల్లెలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి పల్లకీ సేవా, నందికోల సేవ కోలాహలంగా నిర్వహించారు.ఆలయ కమిటీ పెద్దలు రఘునాథరెడ్డి, రామాంజనేయులు, నాగన్న, నాగమద్దయ్య పాల్గొన్నారు.

డోన్: మండలంలోని గోసానిపల్లె, చిన్నమల్కాపురం, కమలాపురం, దొరపల్లె గ్రామాల్లో సోమవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కమలాపురంలో ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త రామ్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామిరెడ్డి, బుగ్గన జయచంద్రారెడ్డి హాజరయ్యారు. మల్కాపురంలో దొంతిరెడ్డి క్రిష్టారెడ్డి, బుగ్గన రాజేశ్వర్‌రెడ్డి బద్దల తిమ్మయ్య, జెడ్పీటీసీ సభ్యులు రాజ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో బండలాగుడు పోటీలు, కోలాటం, చెక్కభజన, స్లో సైకిల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం, ముసలాయి చెర్వు గ్రామాల్లో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామిలకు గ్రామోత్సవం నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి నందికోల సేవ, మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారురు. ఆర్‌ఎస్ రంగాపురంలో చిన్నారుల సీతారాములు, లవకుశ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న చాంద్‌బాషా, భార్య షాహిరాబేగం సొంత పను ల నిమిత్తం బైక్‌పై నంద్యాలకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా మండలంలోని కలుగొట్ల సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఇరువురు గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

డోన్ టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న చలం టీస్టాల్ వద్ద సోమవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో పట్టణానికి చెందిన దశరథ, శ్రీనివాసులు, రామకృష్ణకు గాయాలైనట్లు పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం టీ తాగడానికి షాపు వద్ద నిలబడి ఉన్న ఈ ముగ్గురిపై కారు అదుపు తప్పి మీదకు రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దశరథ కాలుకు తీవ్ర గాయం కాగా మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని కర్నూలుకు తరలించారు. క్షతగాత్రుడు దశరథ తమ్ముడు బలరాముడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న కాటసాని దంపతులు

బనగానపల్లె: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్ద కుమారుడు కీశేలు కాటసాని నాగార్జునరెడ్డి జ్ఞాపకార్థం సోమవారం మహాత్మా జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు అన్నదానం చేశారు. అనంతరం బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండపై ఉన్న బాలాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం

- వారం రోజులుగా నిలిచిన పనులు
- పనుల్లేక కూలీల అవస్థలు


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ వరప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగలక్ష్మి రాజకీయ కారణాలతో ఇటీవల రాజీనామా చేశారన్నారు. దీంతో వారం నుంచి ఉపాధి పనులు నిలిచిపోయాయన్నారు. కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించే వరకు ఉపాధి పథక సిబ్బంది పర్యవేక్షణలో పనులు కొనసాగించాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. పట్టణంలో 2 వేల మందికిపైగా కూలీలు ఉపాధి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. పనులు లేకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు పనులు కల్పించాలని కోరారు. సంఘం నాయకులు ఓబులేసు, రాములమ్మ, బాలస్వామి, రఘు, సుబ్రమణ్యం, దేవి పాల్గొన్నారు.


కుందూనదిలో ఈత కొడుతున్న విద్యార్థులు

పిల్లలు.. జర భద్రం

వేసవికాలం కావడంతో పాఠశాలలకు ఒంటిపూట పాఠశాలలు కొనసాగుతున్నాయి. పాఠశాల ముగిశాక మధ్యాహ్న వేళల్లో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు సమీపాల్లో ఉన్న కుందూనది, వాగులు, చెరువులు, బావుల్లో ఈత సరదాకు వెళుతున్నారు. సోమవారం మండలంలోని గుళ్లదూర్తికి చెందిన కొందరు విద్యార్థులు గ్రామ సమీపంలోని కుందూనదిలో ఈత కొడుతూ కనిపించారు. ఈత కొట్టడం సరదా అయినా జాగ్రత్తలు తీసుకోకపోతే నీట మునిగి ప్రాణాలు కోల్పోయే ఆస్కారముంది. నీరు లోతుగా ఉన్న వైపు వెళ్లకుండా పెద్దల పర్యవేక్షణలో ఈత కొట్టడం అన్ని విధాలా శ్రేయస్కరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

–కోవెలకుంట్ల

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కొలిమిగుండ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంబైపీసీ గ్రూపులున్నాయన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతుందని చెప్పారు. ప్రతి గ్రూపులో 88 సీట్లు ఉంటాయని చెప్పారు. అడ్మిషన్‌లు పొందాలనుకునే విద్యార్థులు పదో తరగతి హాల్ టికెట్ జెరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, విద్యార్థి, తల్లితండ్రులు ఆధార్ కార్డులతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రేపు మంచినీటి సరఫరాకు అంతరాయం

డోన్: పట్టణంలో ఈనెల 9, 10వ తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు వద్దనున్న బండగట్టు ప్రాంతంలో మంచినీటి పైప్ లైన్ మరమ్మతు పనుల కారణంగా రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని.. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని కోరారు.

వక్ఫ్ బోర్డు సవరణపై నిరసన


ప్యాపిలిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ముస్లింలు

ప్యాపిలి/బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఆమోదించిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును తక్షణమే రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, కర్నూలు జిల్లా సమితి సభ్యుడు వెంకటేశ్వర్లు, మైనారిటీ నాయకుడు మస్తాన్ ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్యాపిలిలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాకపోకలను స్తంభింపజేశారు. కేంద్రం తీరును వ్యతిరేకించాల్సిన టీడీపీ, జనసేన అందుకు వంతపాడటం సిగ్గు చేటన్నారు. నాయకులు చాంద్‌బాషా, చికెన్ రఫి, అమీర్ బాషా, ఖాదర్‌బాషా పాల్గొన్నారు. అలాగే బేతంచెర్ల పాత బస్టాండ్ వద్ద సీపీఐ నాయకులు, ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు.

నేటి నుంచి కంబగిరిస్వామి ఉత్సవాలు

- 12న స్వామివారి కల్యాణ మహోత్సవం

అవుకు: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అవుకుకు 20 కిలోమీటర్ల దూరంలో ఎర్రమల కొండల్లోని జక్కలేరు వాగు ఒడ్డున ఉడుము రూపంలో స్వయంభువుగా స్వామివారు కొలువై ఉన్నారు. ఏటా ఉగాది తర్వాత వచ్చే చైత్ర పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం (చైత్రశుద్ధ ఏకాదశి) నుంచి ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణం రోజు రాత్రి భక్తులు ఆలయానికి చేరుకుని అక్కడే నిద్ర చేస్తారు. మరుసటి రోజు స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాలను తిలకించడానికి డోన్, గుత్తి, తాడిపత్రి, యాడికి, రాచర్ల, ప్యాపిలి, బేతంచెర్ల, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాడిపత్రి, డోన్, బనగానపల్లె డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తారు. భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు ఈఓ నాగిరెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.2కోట్లతో అభివృద్ధి

శ్రీలక్ష్మీ కంబగిరి స్వామి తిరు కల్యాణోత్సవాలు ఏటా వైభవంగా జరుగుతాయి. అయితే పురాతన ఆలయం కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విషయాన్ని దివంగత చల్లా భగీరథరెడ్డి, కాటసాని రామిరెడ్డి అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆలయాభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. 2022 అక్టోబర్ 8వ తేదీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు పూర్తయ్యాయి.

ఉత్సవాలు ఇలా

మంగళవారం చైత్రశుద్ధ ఏకాదశి నుంచి లక్ష్మీ కంబగిరి స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. కంబగిరిస్వామి, లక్ష్మీదేవి, సద్దలక్ష్మీ ఉత్సవమూర్తులను ఉప్పలపాడు నుంచి పల్లకీలో కొండపైకి తీసుకెళ్తారు. 9వ తేదీ చైత్రశుద్ధ ద్వాదశిలో హనుమత్ వాహనం, 10వ తేదీ గరుడ వాహనం, 11వ తేదీ గజవాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. 12వ తేదీ చైత్రశుద్ధ పౌర్ణమి రోజు ఉదయం స్వామివారి కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. 13వ తేదీ చైత్ర బహుళ పాడ్యమి సాయంత్రం పారువేట నిర్వహించి, రాత్రికి ఉత్సవమూర్తులు ఉప్పలపాడు గ్రామానికి చేరుతాయి. అక్కడ ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.


ఉత్సవాలకు సిద్ధమైన లక్ష్మీ కంబగిరిస్వామి నూతన ఆలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఆలయాన్ని పునర్నిర్మించడంతో ఒకేసారి సుమారు 200 మంది స్వామి వారిని దర్శించుకోవచ్చు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. డోన్, బనగానపల్లె డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేయించాం.

–చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, ఆలయ ధర్మకర్త